క్లుప్తంగా

పరీక్ష మెటీరియల్ పంపిణీ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల్లోని కస్తూర్బా గాంధీ బాలికోన్నత పాఠశాలల విద్యార్థినులకు ఆదివారం వివేకానంద ఫౌండేషన్ పరీక్ష మెటీరియల్ ఉచితంగా అందచేసింది. సంస్థ వ్యవస్థాపకులు పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దాతల సహాయంతో నాలుగు కస్తూర్బా పాఠశాలల్లో పరీక్షకు అవసరమైన అట్టలు, పౌచ్‌లు, హాల్ టికెట్ కవర్లు, పెన్నులు, పెన్సిల్లు అందజేశామన్నారు. పరీక్షల్లో భయం వీడాలని, జీవిత లక్ష్య సాధనకు పక్కా ప్రణాళిక ఏర్పరచుకోవాలని ఆయన బాలికలకు సూచించారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీఐపై అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీనివాసనగర్‌లో ఆదివారం మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆధ్వర్యంలో ఆర్టీఐపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, ఎంపీజే సుప్రీం కౌన్సిల్ కన్వీనర్ అబ్దుల్ ఖదీర్, ఏపీసీఆర్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ అబ్దుల్లా మాట్లాడుతూ సమాచార హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, రాయలసీమ ఇన్‌చార్జి అయూబ్ ఖాన్, జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణాధ్యక్షుడు హుస్సేన్ బాషా, కార్యదర్శి రఫి, నజీర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఓల్డేజ్ పెన్షన్ పథకం ప్రారంభం

ప్రొద్దుటూరు : స్థానిక సాయిబాబా గుడి ప్రాంగణంలోని ధ్యాన మందిరంలో ఆదివారం వాసవి క్లబ్ సిరిపురం ఆధ్వర్యంలో నూతన ఓల్డ్ ఏజ్ పెన్షన్ పథకాన్ని ప్రారంభించారు. దాతల సహాయంతో ఆర్యవైశ్యులకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున పంపిణీ చేసినట్లు వాసవి క్లబ్ సిరిపురం ప్రెసిడెంట్ గుండా పద్మనాభయ్య తెలిపారు. ప్రతినెల నాలుగో ఆదివారం ఓల్డ్ ఏజ్ పెన్షన్ ఇస్తామని పేర్కొన్నారు. వాసవి క్లబ్ సభ్యులు కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కేబినెట్ సెక్రటరీ అనుమల వేణుగోపాల్‌శెట్టి, రీజనల్ చైర్‌పర్సన్ కాసం శెట్టి సుధాకర్ గుప్తా, రీజియన్ సెక్రటరీ మేడా కామేశ్వరరావు పాల్గొన్నారు.

పరామర్శ



కౌన్సిలర్ శ్రీదేవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబ సభ్యులను ఆదివారం కడప ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధతో కలిసి పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి మాతృమూర్తి తులసమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వైఎస్సార్‌సీపీ బద్వేలు మున్సిపాలిటీ అధ్యక్షుడు గుర్రంపాటి సుందర్‌రామిరెడ్డి సోదరుడు, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి కుమారుడు రవితేజరెడ్డి గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను, రోడ్డు ప్రమాదంలో 15వ వార్డు కౌన్సిలర్ రెడ్డెమ్మ భర్త సుబ్బరాజు మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను, 11వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ శ్రీదేవి గుండెపోటుతో మృతి చెందటంతో ఆమె కుటుంబ సభ్యులను ఎంపీ పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు పాల్గొన్నారు.

చదువుల బాబుకు సాహిత్య పురస్కారం

ప్రొద్దుటూరు : చిత్తూరులో విజయం విద్యాసంస్థల ఆవరణలో చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన డీకే చదువుల బాబుకు శాంతాబాయి – శ్రీధర్ రావు స్మారక సాహిత్య పురస్కారం అందజేసి సత్కరించారు. చదువుల బాబు అనేక బాలల కథలు, సాంఘిక కథలు, కవితలు, గేయాలు రాసి, 21 పుస్తకాలను ప్రచురించి బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, జయంతి పబ్లికేషన్స్ అధినేత ఎస్‌వీ కృష్ణ, రామలక్ష్మి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రం అందజేత

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవాకేంద్రంలో ఆదివారం సకిలి అశోక్ రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన రూ.10లక్షలకు సంబంధించిన మంజూరు పత్రాన్ని ఆయన సోదరుడు సకిలి వెంకటసుబ్బారెడ్డికి సంస్కృతి స్వచ్ఛం సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి అందజేశారు. తాళ్లమాపురం గ్రామానికి చెందిన అశోక్ రెడ్డి కాలేయ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో స్టార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10లక్షలు మంజూరు చేయించారని ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

దిగుబడి లేదు.. ధర లేదు



చాపాడులో జొన్న పంటను నూర్పిడి చేస్తున్న యంత్రం



నక్కలదిన్నె సమీపంలో జొన్న పంట రాశులు

- గతేడాది క్వింటా రూ.3200, ఈ ఏడాది రూ.2100
- కొనుగోలు చేయని ప్రభుత్వం.. దోచుకుంటున్న దళారులు

చాపాడు : ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. జొన్న సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధరల్లేక నష్టపోతున్నారు. మైదుకూరు, దువ్వూరు, చాపాడు, దువ్వూరు, ఖాజీపేట మండలాల్లో 1500 ఎకరాలకు పైగా రైతులు జొన్న పంట సాగు చేశారు. రబీలో సాగైన జొన్న పంటకు రైతులు ప్రస్తుతం నూర్పిళ్లు చేస్తున్నారు. గత ఏడాది 20 వేల ఎకరాలకు పైగా సాగు కాగా, ఈ ఏడాది కొంత తగ్గింది. ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించకపోవడమే కారణం.

దిగుబడి లేదు.. ధర లేదు..

సాగునీటి అవకాశం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు జొన్న పంట సాగు చేశారు. పెట్టుబడి ఖర్చు తక్కువ అవుతుందనే కారణంగా రైతులు ఆసక్తి చూపినా ఈ ఏడాది నిరాశే ఎదురవుతోంది. గత ఏడాది 25 క్వింటాళ్ల దిగుబడి రాక.. ఈ ఏడాది ఎకరాకు 12 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తోంది. దిగుబడి తగ్గినప్పటికీ గిట్టుబాటు ధర లేదు. గతేడాది క్వింటా జొన్నలు రూ.3200 పలుకగా ఈ ఏడాది రూ.2100లకు దళారులు కొనుగోలు చేస్తున్నారు. గతేడాది ప్రభుత్వమే కొనుగోలు చేయగా ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలు పెట్టనేలేదు. దళారులు క్వింటాపై 4 కిలోల జొన్నలు అధికంగా తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



గతేడాది లాగే జొన్నలకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఈ ఏడాది ఆరు ఎకరాల్లో జొన్న పంట సాగు చేశా. 12–15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గతేడాది క్వింటా రూ.3200తో విక్రయించా. ఈ ఏడాది క్వింటా రూ.2100 ఉంది. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి జొన్నలు కొనుగోలు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. లేకుంటే తీవ్రంగా నష్టపోవాల్సిందే.

– సీవీ సుబ్బారెడ్డి, రైతు, పదమర అనంతపురం, చాపాడు మండలం

దేశానికి ఆర్థిక భద్రతను ఇచ్చేది ప్రభుత్వ రంగ సంస్థలే



సంతకం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

కడప కల్చరల్ : భారతీయ బీమా మార్కెట్లోకి పూర్తి స్థాయి విదేశీ బీమా కంపెనీలను అనుమతించాలన్న కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతిపాదనలను నిరసిస్తూ ఉద్యోగ సంఘాలు చేపట్టిన సంతకాల సేకరణ జయప్రదమైంది. ఆదివారం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కడప డివిజన్ ఆధ్వర్యంలో కడప ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ ప్రాంగణంలో ఎల్‌ఐసీ సిబ్బంది నిర్వహించిన బ్యానర్‌పై సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సంఘం జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు అక్బర్ బాషా ఆధ్వర్యంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, రాష్ట్ర పర్యాటకశాఖ రిటైర్డ్ డైరెక్టర్ గోపాల్, ప్రముఖ వైద్య నిపుణులు మహబూబ్ బాషా, వైవీయూనివర్సిటీ ప్రిన్సిపాల్ రఘునాథ్‌రెడ్డి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక బాధ్యత ప్రదర్శిస్తున్న ఎల్‌ఐసీకి పోటీగా అమెరికాలో దివాలా తీసిన ఏఐజీ, గోల్డ్ మెన్ సాక్స్ లాంటి విదేశీ కంపెనీలను మన గడ్డపైకి అనుమతించాల్సిన అవసరం లేదన్నారు.

కేంద్రం ఆలోచన అప్రజాస్వామికం

ఎల్‌ఐసీ సంఘాల నేతలు రఘునాథ రెడ్డి, సుదీకర్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ చట్ట సవరణ బిల్లును హడావుడిగా ఆమోదింప చేసుకొని బీమా రంగంలోకి 100శాతం ఎఫ్‌డీఐ అనుమతించాలన్న కేంద్ర ప్రభుత్వం ఆలోచన అప్రజాస్వామికమని అన్నారు. బ్యాంకింగ్ రంగ సంఘాల నేతలు నాగసుబ్బారెడ్డి, అజీజ్, లలిత, జగదీష్, ప్రసన్న మాట్లాడుతూ 2018 లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుంచి మన దేశాన్ని కాపాడింది ప్రభుత్వ రంగ సంస్థలేనన్న వాస్తవాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తు తెచ్చుకొని ఇన్సూరెన్స్ చట్టానికి తలపెట్టిన సవరణలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ యూనియన్ నాయకులు అవధానం శ్రీనివాస్, శంకరరావు, కేసీఎస్ రాజు, కుమార్, రఘు, గౌస్, కిషోర్, రామాంజుల రెడ్డి, జేవీవీ నాయకుడు రంగనాయకులు పాల్గొన్నారు.

26న నగరేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా నగరేశ్వరస్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారికి, పార్వతి సమేత నగరేశ్వరస్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామమని ఆయన పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని, రాత్రి 10 గంటలకు నగరేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పార్వతిదేవికి సహస్రనామ కుంకుమార్చన చేస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

ఖాజీపేట(చాపాడు) : మండల పరిధిలోని రావులపల్లె పంచాయతీ పాటిమీదపల్లె గ్రామంలో ఆదివారం భక్తుల కొంగు బంగారమైన గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తల సుబ్బరాయుడు యాదవ్, రావులపల్లెకు చెందిన ఓబుళరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెట్రో నగరాలకు దీటుగా ఏఐ వైద్య సేవలు



లాసిక్ మిషన్‌ను చూపిస్తున్న డాక్టర్ వైవీ స్వరూప్ కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు : వైవీ స్వరూప్ కుమార్‌రెడ్డి కంటి ఆస్పత్రిలో అత్యాధునిక సాంకేతిక పద్ధతిలో వైద్య సేవలు అందించడం అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కొనియాడారు. స్వరూప్ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్విండ్ అమరిస్ జర్మన్ లాసిక్ మిషన్‌ను ఆదివారం సాయంత్రం వర్చువల్ విధానం ద్వారా మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా వైద్య సేవలను ఈ నూతన మిషన్ వల్ల పొందవచ్చన్నారు. 28 ఏళ్లుగా చిత్తశుద్ధితో స్వరూప్ వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు దీటుగా ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. డాక్టర్ వైవీ స్వరూప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అత్యధిక సాంకేతిక సేవలకు సంబంధించి స్విండ్ అమరిస్ జర్మన్ లాసిక్ మిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. 2010లోనే తన ఆస్పత్రిలో లాసిక్ మిషన్ ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ఇది మూడో మిషన్ అని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విధానం ద్వారా తెలియని కంటిలోని జబ్బులను గుర్తించవచ్చన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఇదే అత్యాధునికమైన మిషన్ అని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్లు నాగదస్తగిరిరెడ్డి, వరుణ్‌కుమార్‌రెడ్డి, వైవీ రామమునిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు 33 ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రముఖ శైవక్షేత్రాలతో పాటు ప్రకాశం జిల్లాలోని నారాయణస్వామిమఠానికి బద్వేలు ఆర్టీసీ డిపో నుంచి 33 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం నిరంజన్ తెలిపారు. ఆదివారం స్థానిక డీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుండి 27వ తేదీన మధ్యాహ్నం వరకు సర్వీసులు నడుస్తాయని, ఇందులో లంకమల క్షేత్రానికి 22 బస్సులు, మల్లెంకొండకు 5 బస్సులు, బ్రహ్మంగారిమఠానికి 3 బస్సులు, నారాయణస్వామిమఠానికి 3 బస్సులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణీకుల సౌకర్యార్థం అవసరమైతే మరికొన్ని బస్సులు నడిపేందుకు ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి



జిల్లా గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం నూతన కమిటీ

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కడప జిల్లా గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం (క్రుస్మ) జిల్లా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి తెలిపారు. స్థానిక గోల్డెన్ పార్కులో కడప జిల్లా గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన జిల్లా అధ్యక్షుడుగా బీఎస్ రమణారెడ్డి (వేంపల్లి), ప్రధాన కార్యదర్శిగా బి.బాలసుబ్బారెడ్డి (ప్రొద్దుటూరు), కోశాధికారిగా ఎ.ఆంజనేయులు (జీవీ సత్రం), జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన 35 మందిని కార్యనిర్వాహక సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకుడు ఎస్.సోమశేఖర్‌రెడ్డి, పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, ఎం.అశోక్ రెడ్డి, చక్రపాణి రెడ్డి, జి.మాధవరెడ్డి పాల్గొన్నారు.

మట్టి మాఫియాను అరికట్టడంలో అధికారులు విఫలం

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలో విజృంభిస్తున్న మట్టి మాఫియాను అరికట్టడంలో రెవెన్యూ, మైనింగ్ అధికారులు విఫలమయ్యారని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు ఎస్.చంద్రశేఖర్, చంద్రమోహన్‌రాజులు తెలిపారు. ఆదివారం వారి కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నేతల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను దక్కించుకున్న కొంత మంది సబ్ కాంట్రాక్టర్లు తమ రాజకీయ పలుకుబడితో చెరువులు, కొండలు, డీకేటీ భూముల్లో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీసాయి డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం



డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక హోమస్‌పేటలో శ్రీసాయి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆదివారం ప్రారంభించారు. డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకులు, రేడియాలజిస్టు డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఇమామ్‌హుస్సేన్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా ప్రొద్దుటూరు పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు ఖచ్చితమైన, వేగవంతమైన నిర్ధారణ రిపోర్టులను అందిస్తూ అందరి ఆదరాభిమానాలను చూరగొన్నామన్నారు. తమ డయాగ్నోస్టిక్ సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అత్యాధునిక పరికరాలతో నూతన భవనంలో ప్రారంభించినట్లు చెప్పారు. అత్యాధునిక సిటి స్కాన్, అల్ట్రా సౌండ్, డిజిటల్ ఎక్స్‌రే, డెంటల్ సీబీసీటీ, ఓపీజీ, అడ్వాన్స్ డ్ ల్యాబొరేటరీ, ఈసీజీ సేవలతో పాటు కన్సల్టెంట్ డాక్టర్స్ సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ నాయకులు జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఎం నారాయణ, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల : ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భైరవప్రసాద్ మాట్లాడుతూ పోరుమామిళ్ల మండలంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారన్నారు. ఐటీఐ పూర్తి చేసిన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. పూచీ లేని బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, సాధారణ మరణం చెందిన వారికి రూ.5 లక్షల సహాయం అందించాలని, ప్రమాదభృతి కింద రోజుకు రూ.800 ఇవ్వాలని భైరవప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా సూర్యకుమార్, ప్రధాన కార్యదర్శిగా మహబూబ్‌వలి, కార్యవర్గసభ్యులుగా కిరణ్‌బాషా, పెద్ద మస్తాన్, చిన్న హుసేన్‌పీరా, ప్రతాప్, రఫీ, ఇమ్రాన్, రమణలను ఎన్నుకున్నారు. కోశాధికారిగా మల్లికార్జున ఎన్నికయ్యారు. మరో 13 మందితో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

వేసవిలో విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రొద్దుటూరు : వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ కొరత నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కేవీవీ రమణారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం సాయంత్రం తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో 6 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉందని, వేసవి ప్రభావం వలన అదనంగా 20 శాతం డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆరు సబ్‌స్టేషన్ల పరిధిలో అదనంగా 20 చోట్ల 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలను పంపడం జరిగిందన్నారు. ఇంటర్ లింకింగ్ లైన్‌కు సంబంధించి ఆర్డీఎస్‌ఎస్ ద్వారా రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు. శ్రీనివాసనగర్‌లో అసంపూర్తిగా ఉన్న సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

• శేషవాహనంపై భద్రకాళి సమేత వీరభద్రస్వామి



శేషవాహనంపై వీరభద్రస్వామి

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లెలో వెలసిన శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో మహా శివరాత్రి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఐదో రోజు ఆదివారం ఉదయం 5గంటల నుంచి 10గంటల వరకూ, అనంతరం సాయంత్రం 5గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామిని శేషవాహనంపై ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

• పెద్దమ్మతల్లికి కుంభాభిషేకం



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కానపల్లె గ్రామంలో ఆదివారం శ్రీపెద్దమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఇంటింటికి వెళ్లి చల్లాను తెచ్చి పెద్దమ్మ తల్లి వద్ద ఉంచి శాంతి చేశారు. అనంతరం చల్లా బువ్వను భక్తులకు పంపిణీ చేశారు. కుంభాభిషేకం, యంత్ర బింబప్రతిష్టాపన, అష్టబంధనం, మూలమంత్ర హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్దమ్మతల్లి, పోతురాజు విగ్రహాలను వైభవంగా ప్రతిష్టించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆలయ ధర్మకర్త గుమ్మళ్ల లత, ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• సీతారాముల విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని ముడుమాల పంచాయతీ కేశాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఆదివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ మహోత్సవంలో మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొన్నారు. ఆయనకు బాణా సంచాతో స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల రామగోవిందరెడ్డి, ఎంపీపీ చీలేకాంపల్లె వీరనారాయణరెడ్డి, శీలం రామగురివిరెడ్డి, శీలం పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• పోలేరమ్మ రథోత్సవం



రథం వద్ద పూజలు చేస్తున్న దాతలు

బ్రహ్మగారిమఠం : బి.మఠంలోని బద్వేల్‌రోడ్డులో ఉన్న కనుమ పోలేరమ్మ అమ్మవారి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాతలు కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన భీమినేని కాశినాయుడు, ఆయన భార్య లక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారిని ఉత్సవ విగ్రహాలతో రథోత్సవం గుడిదగ్గర నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

• త్రిమూర్తి శివ జయంతి



త్రిమూర్తి శివ జయంతిని నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయనగరం వీధిలోని ఓశాంతి భవనంలో ఆదివారం 89వ త్రిమూర్తి శివ జయంతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపు కుంకుమ వర్ణమిలితమైన పరామాత్మ పతాకాన్ని ఎగురవేసి, జ్యోతులను వెలిగించి కేక్ కట్ చేశారు. ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు బీకే శాంత మాట్లాడుతూ ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం స్థాపించి 89 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. గృహస్త ధర్మానికి చెందిన సహజ రాజయోగాన్ని ఆచరించడం వల్ల కుటుంబంలో సత్సంబంధాలు మరింత బలపడుతాయని పేర్కొన్నారు. రాజయోగ సాధన చేయడం ద్వారా సర్వ మానసిక ఒత్తిడిలను, మానసిక రుగ్మతలను జయించి మనస్థైర్యాన్ని, ప్రశాంతతను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఓంశాంతి సభ్యులు విశ్వకల్యాణం కోసం లింగానికి ప్రత్యేక పూజలు చేశారు.

• అర్పణాల పండుగ



సవాల్‌లో దక్కించుకున్న వారికి దేవుని ఫలాలను అందజేస్తున్న ఫాస్టర్ సీమరాణి

రాజుపాళెం : రాజుపాళెంలోని చర్చిలో ఆదివారం అర్పణాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫాస్టర్ సీమరాణి మాట్లాడుతూ ఏడాది కోసారి ఈ అర్పణాల పండుగను జరుపుకుంటామని, క్రీస్తు ద్వారా పొందిన మేలును దశమ భాగంలో క్రైస్తవులు ధనం, ధాన్యం ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు. ప్రార్థనలకు వచ్చిన వారికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం దేవుని ఫలాలను సవాల్ వేశారు. కార్యక్రమంలో ఫాస్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సామాన్యుల చెంతకు శ్రీ శివ భక్తేంద్రస్వామి చరిత్ర



పుస్తక పరిచయ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట(చాపాడు) : శ్రీ శివ భక్తేంద్రస్వామి చరిత్రను ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అద్భుతంగా రచించి సామాన్యుల చెంతకు తీసుకురావడం అభినందనీయమని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తుడుముదిన్నెలో జిల్లా రచయిత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మూల మల్లికార్జునరెడ్డి రచించిన శ్రీ శివ భక్తేంద్ర స్వామి పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. మల్లికార్జునరెడ్డి శివ భక్తేంద్రస్వామి బాల్యం నుంచి ఆయన నిర్యాణం వరకూ జరిగిన అన్ని సంఘటనలను సామాన్యులను అర్థమయ్యే తేలిక భాషలో రచించారన్నారు. సభాధ్యక్షులు గోసుల వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ శివ భక్తేంద్ర స్వామి ఆలయ నిర్మాణం తన ఆధ్వర్యంలో జరగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తాను అనేక పర్యాయాలు స్వామి వారి ఆరాధన మహోత్సవాల్లో పాల్గొన్నానని, ఈ ఆలయానికి తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఆత్మీయ అతిథి కొత్తపల్లి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విలువైన పుస్తకాన్ని వెలుగులోకి తేవడం అభినందనీయమన్నారు. తవ్వా వెంకటయ్య పుస్తకాన్ని సమీక్షించారు. డా.వెల్లాల వెంకటేశ్వరాచారి శివ భక్తేంద్రస్వామి పై గోసుల వెంకటసుబ్బారెడ్డి రాసిన పాటలను ఆలపించారు. కార్యక్రమంలో డా.కొప్పోలురెడ్డి శేఖర్‌రెడ్డి, మూల శివారెడ్డి, రంగస్థల కళాకారులు పాలు ఓబుళరెడ్డి, మూల ఈశ్వరరెడ్డి, చందా నాగార్జునరెడ్డి, చాట్ల గంగరాజు, లింగాల చిన్న వీరయ్య, పెద్ద వీరయ్య, ముసలయ్యగారి పుల్లయ్య, సుబ్బారెడ్డి, రోశిరెడ్డి, బాలసుబ్బారెడ్డి, సత్యరాజు పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి బంధువులు మధుసూదన్‌రెడ్డి, నాగిరెడ్డి, గురివిరెడ్డిలను మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఘనంగా సన్మానించారు.

చదువుతోపాటు నైతిక విలువలు అలవర్చుకోవాలి



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో శివదర్శనానంద సరస్వతి మాతాజీ

ప్రొద్దుటూరు కల్చరల్ : చదువుతోపాటు నైతిక విలువలు అలవర్చుకోవాలని శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఫౌండర్ శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు. స్థానిక సాయికుటీర్ రోడ్డులోని గౌతమ్ హైస్కూల్‌లో పాఠశాల 37వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని నేర్చుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. డాక్టర్ జీవీజీ మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యం పట్ల శ్రాద్ధ వహించాలని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ సుధీర్ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతోపాటు నైతిక విలువలు, సంస్కారాన్ని విద్యార్థులకు నేర్పిస్తున్నామన్నారు. డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ రెడ్డి, గౌతమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ టి.మునిలక్షుమ్మ, మెంబర్ హర్షప్రియ, డైరెక్టర్ టీసీఎం నాయుడు, హెడ్‌మిస్ట్రెస్ ఇంద్రాణి పాల్గొన్నారు.